ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

బుధవారం 11 జూన్ 2025

సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా జైరామ్

సాలూరు, జూన్10(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.జైరామ్ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆయన విశాఖ పట్టణం జీవీఎంసీలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు సాలూరు పురపాలక సంఘం కమిషనర్‌గా పనిచేసిన డీటీవీ.కృష్ణను జగ్గయ్యపేటకు బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా మూడు నెలల లోపే ఆయన బదిలీపై వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

దారి కష్టాలు తప్పవా?



విజిలెన్స్ నివేదిక రాకపోవడంతో నిలిచిన బందమానుగూడ-టేకుమానుగూడ రోడ్డు నిర్మాణం

- గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 36 రహదారి పనులపై ఆరోపణలు
- గత వైసీపీ సర్కారు హయాంలో మంజూరు
- అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు
- కాంట్రాక్టర్ల తీరుపై విమర్శలు
- కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ
- క్లియరెన్స్ రాక నిలిచిన రోడ్ల నిర్మాణాలు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట రూరల్, జూన్10(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన రహదారి పనులపై విజిలెన్స్ అధికారులు చేపడుతున్న విచారణ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వాటిపై వచ్చిన ఆరోపణల మేరకు ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలోని రోడ్లను విజిలెన్స్ ఎస్పీ ఆధ్వర్యంలో టెక్నికల్ టీం సభ్యులు మూడు విడతల్లో పరిశీలించారు. ఇంకా పాతపట్నం, పలాస, మందస, మెళియాపుట్టి, హిరమండలం మండలాల్లో నిర్మించిన రహదారుల పనులపై విచారణ చేపట్టాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గతంలో చేపట్టిన రహదారి పనులు సగంలో నిలిచిపోగా.. వర్షాకాల సీజన్‌లో అవి మరింతగా పాడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజిలెన్స్ అధికారుల విచారణ పూర్తిచేసి నివేదిక ఇస్తే కాని వాటి పనులు పునఃప్రారంభించే పరిస్థితి లేదు. దీంతో గిరిజనులకు ఇప్పట్లో రహదారి కష్టాలు తప్పేటట్లు లేవు. మొత్తంగా 36 రోడ్ల పనులకు క్లియరెన్స్ రావల్సి ఉంది.

ఇదీ పరిస్థితి...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019- 2023) గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించారు. ఉపాధి నిధులతో ఈ పనులు చేట్టారు. అయితే ఐటీడీఏ పరిధిలో సీతంపేట, పాతపట్నం, మందస, పలాస, మెళియాపుట్టి, హిరమండలం మండలాల్లో చేపట్టిన రహదారి నిర్మాణ పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్లు శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి గతంలో ఫిర్యాదులు వెళ్లాయి. మొత్తంగా ఆయా మండలాల్లో 36 రహదారుల్లో రూ.54.88 కోట్లు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సంబంధిత విజిలెన్స్ అధికారులు ఇప్పటికి మూడుసార్లు సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించారు. అప్పట్లో నిర్మించిన రహదారులు, నాణ్యత ప్రమాణాలు నిగ్గుతేల్చే పనిలో ఉన్నారు. ఇదిలా ఉంటే ఆ రోడ్ల పరిస్థితి పరమ అధ్వానంగా మారింది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు...

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీతంపేట నుంచి నౌగూడ అక్షరబ్రహ్మ దేవాలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ఉపాధి నిధులు రూ.80లక్షలతో సంబంధిత కాంట్రాక్టర్ దాని పనులు ప్రారంభించారు. రహదారి పొడవునా డబ్ల్యూబీఎం (వెట్ మిక్స్)పరిచారు. ఇంకా అక్కడక్కడా 150 మీటర్ల వరకు రక్షణ గోడలు నిర్మించారు. అయితే ఇంజనీరింగ్ అధికారి, సిబ్బంది పర్యవేక్షణ లేకపోడంతో పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తోంది. నిబంధనల ప్రాప్తికి రక్షణగోడల పనుల్లో 53గ్రేడ్ సిమెంట్ వినియోగించాల్సి ఉంది. కానీ పీపీసీ(43గ్రేడ్)సిమెంట్‌ను వినియోగించారని, రక్షణగోడలకు క్యూరింగ్ కూడా చేయలేదని పెదరామ ఉపసర్పంచ్ సవర బోగేసు, నౌగూడ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలా నిర్మాణాలు చేపడితే ఎంత కాలం ఉంటాయని వారు ప్రశ్నిస్తున్నారు.



గిరిజన ఇంజనీరింగ్ శాఖ కార్యాలయంలో కంప్యూటర్ వర్క్ చేస్తున్న కాంట్రాక్టర్ (ఫైల్)

కాంట్రాక్టర్ల హవా

- సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో కాంట్రాక్టర్ల హవా నడుస్తోంది. ఇంజనీరింగ్ అధికారులకు నచ్చిన వారికి పనులతో పాటు కార్యాలయంలో ఏం కావాలన్నా సొంతంగా చేసుకునే వెసులుబాటు ఉంది. ఇటీవల (మిగతా 8వ పేజీలో...)

టీడబ్ల్యూ ఈఈ ఏమన్నారంటే..

'గతంలో చేపట్టిన రహదారి పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇది పూర్తయిన తరువాత వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చేసుకొని మిగిలిన పనులు పునఃప్రారంభిస్తాం. మా కార్యాలయంలో కాంట్రాక్టర్లకు ఎటువంటి ఫ్రీహ్యాండ్ ఇవ్వలేదు. అటువంటి విషయం మా దృష్టికి రాలేదు.' అని టీడబ్ల్యూ ఈఈ రమాదేవి తెలిపారు.

విపత్తులపై అప్రమత్తం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. రుతుపవనాల రాక , భారీ వర్షాలు, వరదలు, రక్షణ చర్యలపై చర్చించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రెడ్ క్రాస్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, వీఏవోలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. చెరువులు, కాలువలు, రిజర్వాయర్ల వల్ల ప్రజలు, పశు సంపద, పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. వాతావరణశాఖ హెచ్చరికలను మైకుల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రెస్క్యూ ఆపరేషన్లకు అవసరమైన వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ గ్రౌండింగ్ వేగవంతం కావాలని ఏపీఈపీడీసీఎల్ ఏడీలను ఆదేశించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, వార్డు స్థాయిల్లో శిబిరాలు నిర్వహించాలని, అక్కడే రిజి స్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు మంజూరు వంటివి గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే రుణాలు మంజూరురైనా కొన్ని చోట్ల గ్రౌండింగ్ కాలేదని, అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈలకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ శోభిక , డీఆర్‌వో హేమలత, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, డీఎంహెచ్‌వో భాస్కరరావు , ఐటీడీఏ ఏపీడీ మురళీధర్, వెలుగు పీడీ సత్యంనాయుడు, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవద్దు


- టెన్త్ ఫలితాలపై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అసంతృప్తి
- హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవోలపై ఆగ్రహం

సీతంపేట రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల సాధనలో వెనుకబడిన వివిధ పాఠశాలల హెచ్‌ఎంలపై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ వైఫల్యాలను గిరిజన విద్యార్థులపై నెట్టి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయొద్దు.' అని అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల , పోస్టుమెట్రిక్ పాఠశాలల హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా సమీక్షించారు. పదో తరగతి శతశాతం ఫలితాలు సాధనలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విఫలమయ్యారని పీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరి జన విద్యార్థులపై బాధ్యతగా వ్యవహించాలని, డ్రాపౌట్లుగా మారకుండా చూడాలని ఆదేశిం చారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు స్థాయిని ఏటీడబ్ల్యూవోలు ఎప్పటికప్పుడు పర్య వేక్షించాలన్నారు. పాఠ్యాంశాలు సక్రమంగా బోధించకుండా ఫలితాలు ఏవిధంగా సాధిస్తారని హెచ్‌ఎంలను ప్రశ్నించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులు అందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించి పాఠశాలల వారీగా లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశా లలకు వచ్చే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో కుమార్, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఏజెన్సీలో భారీ వర్షం



పార్వతీపురం వీధుల్లో నిలిచిన వర్షపునీరు 6లో

కుళ్లిన మాంసం, చేపలు సీజ్

- దుకాణాలపై అధికారుల దాడులు
- రూ.10 వేలు అపరాధ రుసుం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సాలూరు రూరల్, జూన్10(ఆంధ్రజ్యోతి): సాలూరులో కొందరి వ్యాపారుల తీరు మారడం లేదు. యథేచ్ఛగా కుళ్లిన మాంసం, చేపల విక్రయానికి యత్నిస్తున్నారు. కొద్దిరోజుల కిందటే మున్సిపల్ అధికారులు దాడులు జరిపి మార్కెట్లో కుళ్లిన మాంసాన్ని సీజ్ చేశారు. దానిని విక్రయించేందుకు యత్నించిన వ్యాపారికి అపరాధ రుసుం విధించారు. అయితే తాజాగా కొంతమంది మళ్లీ అదేవిధంగా విక్రయాలు జరపడం పట్టణంలో చర్చనీయాంశమైంది. 'ఈ మాంసం తింటే అంతే' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం విదితమే. దీనిపై స్పందించిన మున్సిపల్, పశు సంవర్ధకశాఖాధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ, పశుసంవర్ధకశాఖకు చెందిన ప్రభాకర్, పర్యావరణ కార్యదర్శులు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, జైపూర్ రోడ్డు, కోట తదితర ప్రాంతాల్లో మాంసాహార, చేపల అమ్మకాలను పరిశీలించారు. కుళ్లిన పది కిలోల మాంసం, పాడైన 20 కిలోల చేపలను విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. సంబంధిత వ్యాపారులకు రూ. 10 వేల అపరాధ రుసుం విధించారు. సీజ్ చేసిన మాంసం, చేపలను బ్లీచింగ్ వేసి పాతిపెట్టారు. ప్రజారోగ్యానికి చేటు తెచ్చే కుళ్లిన, పాడైన మాంసం, చేపలను మళ్లీ విక్రయిస్తే ప్రజారోగ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ వ్యాపారులను హెచ్చరించారు. తొలిసారి కావడంతో అపరాధ రుసుం విధించామన్నారు. మరోసారి నిబంధనలను అతిక్రమిస్తే షాపులను తొలగిస్తామని హెచ్చరించారు. వినియోగదారులకు తూనికల్లో మోసం చేయరాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాని సూచించారు. తాజా మాంసం, చేపలనే విక్రయించాలన్నారు.



మాంసం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

డీపీవోగా రవీంద్ర

పార్వతీపురం/గరుగుబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్.రవీంద్రను నియమించారు. గతంలో గరుగుబిల్లి ఎంపీడీవోగా ఆయన పనిచేశారు. ఉపాధి హామీ ఏపీడీగా, జిల్లా విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం విశాఖ జిల్లాలో డివిజనల్ అభివృద్ధి అధికారిగా, జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. బదిలీల నేపథ్యంలో ఆయన్ని మన్యం జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం డీపీవోగా ఉన్న టి.కొండలరావును రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆదేశించారు. బదిలీల్లో స్థానాన్ని కేటాయించలేదు. నూతన డీపీవో రవీంద్ర కొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మరికొందరికి బదిలీలు

పార్వతీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యాన శాఖాధికారి శ్యామలకు విశాఖపట్నం బదిలీ అయింది. ఆమె స్థానంలో గతంలో జిల్లా ఉద్యాన శాఖాధికారిగా పనిచేసిన సత్యనారాయణ రెడ్డి నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన విశాఖలో పనిస్తున్నారు. వెలుగు ఏపీడీగా పనిచేస్తున్న సత్యంనాయుడుకు తూర్పుగోదావరి జిల్లా బదిలీ అయింది. ప్రస్తుతం వెలుగును డీఆర్‌డీఏలో విలీనం చేయడంతో ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదని సమాచారం.

కదలని ఏనుగులు



6లో

జగన్ క్షమాపణ చెప్పాలి

- వైసీపీ నాయకుల తీరుమారలేదు: మంత్రి సంధ్యారాణి 8లో

ఒత్తిడిని జయిద్దాం..ఆరోగ్యంగా ఉందాం

- యోగాతో ఎంతో మేలు
- పోషకాలు ఉండే ఆహారం తినాలి
- ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలి 6లో

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

6లో

'ఆపరేషన్ సిందూర్' సైనికులకు ఘన సత్కారం

ఎస్జీటీల కౌన్సెలింగ్

నేటికి వాయిదా

- వెంటాడిన సాంకేతిక సమస్యలు
- రాత్రి వరకు వేచి ఉన్న ఉపాధ్యాయులు

సాలూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో చివరి అంకమైన ఎస్జీటీల కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా పడింది. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను పార్వతీపురంలో ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. అనంతరం టీడీజీ ఎమ్మెల్సీల వినతితో ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని (మిగతా 8వ పేజీలో...)



జడ్పీ కార్యాలయం వద్ద వేచి ఉన్న ఉపాధ్యాయులు

రియల్..ఢమాల్

- జిల్లాలో మందగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- గత వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయాల ఎఫెక్ట్
- ఎల్‌ఆర్‌ఎస్, వీఎల్‌టీతో ఇక్కట్లు
- అమ్ముడుపోని భూమి, స్థలాలు
- అప్పుల్లో రియల్టర్లు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరు తగ్గింది. ఆశించిన స్థాయిలో భూములు, స్థలాల క్రయ విక్రయాలు జరగడం లేదు. దీంతో రియల్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో నూతన జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలుగా ఉంటుందని రియల్టర్లు భావించారు. ఈ మేరకు కోట్లాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టారు. అయితే వారి ఆలోచనలకు భిన్నంగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. దీంతో రియల్టర్లు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం వారంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ఎల్‌ఆర్‌ఎస్, ఈఎల్‌టీ, ఈ-స్టాంపింగ్ తదితర వాటిని కూడా రద్దు చేసి రియల్ రంగాన్ని ఆదుకోవాలని రియల్టర్లు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- నూతన జిల్లాగా ప్రకటించిన తర్వాత పార్వతీపురం నలువైపులా నుంచి వచ్చిన వ్యాపారులు భారీ పెట్టుబడులు పెట్టి రహదారులకు ఇరువైపులా ఉన్న స్థలాలు, పొలాలను కొనుగోలు చేశారు. దీంతో అప్పటివరకు మామూలు ధర పలికిన భూములు, స్థలాల రేట్లు అమాంతం పెరిగాయి. అయితే అందుకు తగ్గట్టుగానే వ్యాపారాలు జరుగుతాయనే ఆలోచనలతో వ్యాపారులంతా సిండికేట్లుగా ఏర్పడ్డారు. ఎడాపెడా భూములు, ఖాళీ స్థలాలను కొనుగోలు చేశారు.
- పార్వతీపురం నుంచి 20 కిలోమీటర్ల వరకు, పాలకొండ-పార్వతీపురం ప్రధాన రహదారి, పాలకొండ-రాయగడ (మిగతా 8వ పేజీలో...)



ఒత్తిడిని జయిద్దాం.. ఆరోగ్యంగా ఉందాం





● యోగాతో ఎంతో మేలు
● పోషకాలు ఉండే ఆహారం తినాలి ● ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలి

రాజాం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో దైనందిన జీవితం ఒత్తిళ్లమయం. వేగభరితమైన సమాజంలో ప్రతిఒక్కరూ ఏదో ఒక సమయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నవారే. ఈ విషయంలో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదు. చదువు, వృత్తి, ఉద్యోగాల విషయాల్లో రోజు రోజుకీ పెరిగిపోతున్న పోటీ, సమయాభావం, నిద్రలేమి, ఉరుకు పరుగుల జీవనంతో నేటి యువత సతమతమవుతోంది. ఇవన్నీ శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉత్సాహంతో, ఉల్లాసంగా ఉండాల్సిన వయసులో నీరసం, నిసత్తువ ఆవహిస్తుంది. తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ఒత్తిడిని ఎదుర్కొంటూ పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యాయామం వంటివి చేయాలని అంటున్నారు. మన తీసుకునే ఆహార విషయాల్లో సైతం జాగ్రత్తలు పాటించాలని, అప్పుడే శక్తిని, పునరుత్తేజాన్ని పొందుతారని చెబుతున్నారు.

పుస్తకాలతో కుస్తీ..

ఉదయం పాఠశాల, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు ఏ రాత్రికో గానీ ఇళ్లకు చేరడంలేదు. పోటీ ప్రపంచంలో కాన్వెంట్ నుంచి కళాశాల చదువు వరకూ ర్యాంకుల మయంగా మారింది. దీంతో సంబంధిత యాజమాన్యాలు విద్యార్థులను 10 నుంచి 12 గంటల వరకు తమ వద్దనే ఉంచుతున్నాయి. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. వేకువజామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఐదో గంటకు స్టడీ అవర్‌కు సిద్ధం కావాల్సిన పరిస్థితి. ప్రతి నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఏడాదంతా చదివినా అనుకున్న ర్యాంకు వస్తుందా? రాదా? అనే టెన్షన్ విద్యార్థులను శారీరకంగా మానసికంగా కుంగదీస్తోంది. మూడేళ్లు నిండని చిన్నారులకు సైతం పుస్తకాల బ్యాగు మోత తప్పడం లేదు.

గృహిణులదీ అదే పరిస్థితి..

ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పొద్దుపోయే వరకూ గృహిణులకు ఇంటా బయటా ఒకటే ఒత్తిడి. భర్త, పిల్లల సంక్షేమం, ఉన్నతి కోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. గృహావసరాలు, పిల్లల అల్లరి, వారి చదువు, హోంవర్క్‌లు ఇలా నిత్యం అష్టావధానం చేయాల్సివస్తోంది. పిల్లలు అనారోగ్యానికి గురైతే తీవ్ర ఒత్తిడికి గురవుతూ సేవలందించే పరిస్థితి గృహిణులది. ఉద్యోగం చేస్తున్న మహిళల సంగతి చెప్పనవసరం లేదు. ఇంటికి సంబంధించి అన్నిపనులూ పూర్తిచేసుకుని ఆదరాబాదరాగా విధులకు సకాలంలో చేరాలి. ఆఫీసులో పని ఒత్తిడి, కొన్నిచోట్ల మానసిక వేధింపులు. అయినాసరే సర్దుకుపోయే పరిస్థితి.



ఇలా చేస్తే మేలు..

- ఒత్తిడిని జయించేందుకు ప్రతిరోజూ యోగా చేయాలి.
- ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- ఖాళీ సమయంలో ఆటలు ఆడాలి.
- మంచి సంగీతం వినేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- పార్కులు, కొత్త ప్రదేశాలు చూసేందుకు వెళ్లాలి.
- పుణ్యక్షేత్రాల సందర్శన మనసుకి హాయిని కలిగిస్తుంది.
- టీవీల్లో హాస్యభరితమైన సన్నివేశాలు చూసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- స్నేహితులతో భావాలను పంచుకుంటే మేలు.
- గార్డెనింగ్, పెంపుడు జంతువులకు కొంత సమయం కేటాయిస్తే మంచిది.
- విటమిన్స్, మినరల్స్, మంచి పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి.
- చేపలు, డ్రైఫ్రూట్స్, వాల్‌నట్స్, బాదం, గుమ్మడికాయ గింజలు, ఆకుకూరలు, పెరుగు, డార్క్‌చాక్లెట్స్ తినాలి.
- ప్రతి రాత్రి 6 నుంచి 8 గంటలు నిద్రపోవాలి
- ఎక్కువగా ఆలోచించకూడదు.

ఉద్యోగులు..

నేటి ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జిల్లా కలెక్టర్ మొదలు దిగువస్థాయి ఉద్యోగి వరకూ ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడికిలోనై కొంతమంది ఉద్యోగులు రక్తపోటు, సుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన వారు కొందరైతే.. యంత్రాల్లా పనిచేస్తున్నా గుర్తింపులేని పరిస్థితి మరికొందరిది. సాధారణ పౌరులు, కూలీలు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పని దొరుకుతుందా? లేదా?, ఇంటి ఖర్చులు, కట్టాల్సిన బిల్లులు, అప్పులు, వడ్డీలు ఇలా రోజంతా వారిలో ఒకటే ఆందోళన నెలకొంటుంది. అనుకోకుండా వారు రోగాలబారిన పడితే అంతే సంగతులు. ఇంటిల్లపాదినీ తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

యోగాతో ఒత్తిడి మాయం..



నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని ఇట్టే జయించవచ్చును. గతానికి భిన్నంగా జీవనం కొనసాగుతోంది. యాంత్రిక జీవనంలో మనుషులు ప్రతి చిన్న విషయానికి ఆందోళనకు గురవుతున్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు, యువత సంఘర్షణకు గురవుతున్నారు. మూడు పదుల వయసులోనే గుండెపోటుకు గురవుతున్న సంఘటనలు కోకొల్లలు. ప్రతివ్యక్తి తప్పనిసరిగా యోగా చేయాలి. మనసుని ప్రశాంతంగా ఉంచుకోవాలి.

-టీటీవీ రమణమూర్తి, యోగా గురువు



కదలని ఏనుగులు

సీతానగరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగుల గుంపు గత ఐదు రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. కోటసీతారాంపురం, రంగంపేట గ్రామాల మధ్య సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రంగంపేట సమీపంలోని తోటల్లో తిష్ఠ వేశాయి. ఆయా గ్రామాల ప్రజలు ఒంటరిగా రాత్రి సమయంలో తిరగరాదని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.



రంగంపేట సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ తల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి, మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురు గుడిలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మూడు లాంతర్ల వద్ద గుడి ఆవరణలో ఆదినారాయణ కళాపీఠం ఆధ్వర్యంలో గంటా లక్ష్మి సినీ ఆర్కెస్ట్రా బృందం భక్తి గీతాలను ఆలపించింది.



వివిధ రకాల పువ్వులతో పైడిమాంబకు అలంకరణ

తాటిచెట్టును కమ్మేసిన పొదరిల్లు

సాలూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పొడవైన తాడిచెట్టును పొదరిల్లు కమ్మేసింది. పరాన్నజీవులైన పొదలు మరో చెట్టు ఆసరాగా ఎదుగుతాయి. చెట్టంతా లతలతో పాకి దానిని కబళిస్తాయి. ఆసరా ఇచ్చిన చెట్టుకు సూర్యరశ్మి అందకుండా పొదరిల్లు పెనవేసుకుపోతాయి. దీంతో కిరణజన్య సంయోజన ప్రక్రియ జరగక ఆ చెట్టు చనిపోతుంది. దండిగాం రోడ్డులో బంగారమ్మపేట సమీపంలో ఇలా ఒక తాడిచెట్టును పొదరిల్లు కమ్మేస్తోంది దీన్ని ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



తాడిచెట్టును అల్లుకున్న పొదరిల్లు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

● కలెక్టర్ అంబేడ్కర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం రింగురోడ్డు/కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి ఏరియా ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వైద్యశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. బాడంగి, బొబ్బిలి, నెల్లిమర్ల, భోగాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అన్నింటిని పూర్తి చేసి జూలై నెలాఖరుకు అప్పగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అందుకే పనులు పూర్తిచేయలేక పోతున్నామని కాంట్రాక్టర్లు వివరించారు. నిధుల కోసం వైద్యశాఖ ముఖ్య కార్యదర్శికి, డీవోకి లేఖ రాయాలని డీసీహెచ్ఎస్‌కు కలెక్టర్ సూచించారు. జిల్లాలో కరోనా పరీక్షల కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం శాంపిల్స్‌ను విశాఖకు పంపిస్తుండడంతో కరోనా నిర్ధారణలో జాప్యం జరుగుతుందన్నారు. జిల్లాలో రాపిడ్ టెస్టులు చేయడానికి అవసరమయ్యే ఎక్విప్‌మెంట్‌ను రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో జీవనరాణి, డీసీహెచ్ఎస్ పద్మజారాణి, ఏపీఎస్ఎంఐడీసీ ఎస్ఈ విజయభాస్కర్, ఈఈ ఎం.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఒకేరోజు వివిధ పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని శాఖల నుంచి మొత్తం 428 పనులకు గాను, రూ.92.17 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో ప్రారంభోత్సవాలకు 290 పనులు, శంకుస్థాపనలకు 138 పనులను ఎంపిక చేసినట్లు చెప్పారు. నియోజకవర్గాల వారీగా సంబంధిత శాసనసభ్యులను సంప్రదించి ప్రారంభోత్సవాలు చేయించాలని, ముందుగానే శిలాఫలకాలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీవో బాలాజీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, సర్వశిక్షా అభియాన్, విద్యుత్, నగరపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' సైనికులకు ఘన సత్కారం



సైనికులను సత్కరిస్తున్న ఎస్ఐ గణేష్, గ్రామ పెద్దలు

నెల్లిమర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరోచితంగా పాల్గొన్న జరజాపుపేట సైనికులను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గాంధీరామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు మద్దిల సన్యాసిరావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు కలిశెట్టి సత్యనారాయణ, మద్దిల హరేరామ్, అవనాపు రాజేష్, కిల్లంపల్లి భీమారావు, నల్లి నాగమహేష్‌ను ఎస్ఐ బి.గణేష్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. సైనికులతో పాటు వారి తల్లిదండ్రులను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ.. యుద్ధంలో పోరాడిన సైనికులను సత్కరించడం మంచి సంప్రదాయమని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలను ఇకముందు కూడా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



పార్వతీపురం మేదరవీధిలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పార్వతీపురం/సాలూరురూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీతో పాటు పార్వతీపురంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సాలూరు, కూర్మరాజుపేట, బొడ్డవలస, కొత్తవలస, దత్తివలస, మామిడిపల్లి, మరిపిల్లి, అన్నంరాజువలస తదితర గ్రామాల్లో కుండపోతగా వాన పడింది. సాలూరు పట్టణంలోని వేంకటేశ్వరకాలనీ, నాయుడువీధి, డబ్బివీధి, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో కాలువలు ఉప్పొంగి ప్రవహించాయి. వేంకటేశ్వర కాలనీలో రామమందిరం ఎదుట వీధి జలమయం కావడంతో జనం ఇబ్బంది పడ్డారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తన సిబ్బందితో చేరుకొని కాలువల్లో పూడికలు తీయించారు. వరదనీటిని ఇరిగేషన్ కాలువలోకి మళ్లించారు. దీంతో సమస్య తీరింది. అలాగే, జిల్లా కేంద్రం పార్వతీపురంలో పలు వీధులు చెరువులను తలపించాయి. మేదరవీధి, రెడ్డివీధిలో రోడ్లు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షం వస్తే కాలువల్లోని మురుగునీరంతా ప్రధాన రహదారిపైకి వచ్చి నిల్వ ఉంటుంది. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగతా చోట్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు తమ సమస్యను పరిష్కరించడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



జలమయమైన సాలూరు వేంకటేశ్వర కాలనీ



సాలూరులో కురుస్తున్న వర్షం



పార్వతీపురం రెడ్డివీధి సమీపంలో ఇలా..

జోరుగా మట్టి తవ్వకాలు

●పట్టించుకోని అధికారులు ●రూ.లక్షలు వెనకేసుకుంటున్న అక్రమార్కులు



గోపాలపల్లి వద్ద డి-పట్టా భూముల్లో మట్టి తవ్వకాల దృశ్యం

శృంగవరపుకోట రూరల్, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, డి పట్టా భూముల్లో వేటటినీ వదలడంలేదు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. మండలంలోని గోపాలపల్లి రెవెన్యూ పరిధిలో ఓ వ్యక్తి తన ఎక్స్‌కవేటర్‌తో గడిచిన మూడు రోజులుగా డి పట్టా భూముల్లో పెద్దఎత్తున మట్టిని తవ్వేస్తున్నారు. ఆ మట్టిని సీతారాంపురం వద్ద లే అవుట్‌లో మూడు రోజుల పాటు సుమారు 500 లోడ్లు ట్రాక్టర్లతో తరలించి రూ.లక్షలు గడించాడు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు కిమ్మనడంలేదు. మట్టి తవ్వకాలకు ముందుగా అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ఎవ్వరూ తీసుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించిన మట్టి అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



సీతారాంపురం వద్ద లేఅవుట్‌లో పోసిన మట్టి

పల్లా శ్రీనివాస్‌కు పరామర్శ

విజయనగరం రూరల్, జూన్10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన నివాసానికి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేశ్వర్మ, అనురాధబేగం, విజయనగరం యాదవ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శుభ్రతపై దృష్టి పెట్టాలి

కొత్తవలస, జూన్10 (ఆంధ్రజ్యోతి): బాలికలు వ్యక్తిగత శుభ్రతపై దృష్టిపెట్టాలని వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీవో ఆర్.ఉమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని తుమ్మికాపల్లిలో కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామేశ్వరి, లక్ష్మీబాయ్, కె.రమణమ్మ, ఈశ్వరరావు, సత్యారావు, సర్పంచ్ విరోతి కొండలరావు పాల్గొన్నారు.

డెంకాడ ఏవోగా సంగీత

డెంకాడ, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా టి.సంగీత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. డెంకాడ మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన పి.నిర్మల భోగాపురం వ్యవసాయాధికారిగా బదిలీపై వెళ్లారు. విజయనగరం రైతు శిక్షణ కేంద్రంలో వీవోగా పనిచేసిన టి.సంగీత ఇక్కడ విధుల్లో చేరారు.

కొవిడ్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

విజయనగరం కలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొవిడ్ పరీక్షలకు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఓ ప్రకటనలో కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ప్రస్తుతం కొవిడ్ పరీక్షల కోసం శాంపిల్స్‌ను విశాఖకు పంపడం జరుగుతోందన్నారు. దానివల్ల ఫలితాలు ఆలస్యమవుతున్నాయన్నారు. అందుకు ఆర్‌టీపీసీఆర్ టెస్టులు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వోను ఆయన ఆదేశించారు.

క్రీడాకారులకు యూనిఫాం

నెల్లిమర్ల, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు విజయనగరం జైత్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు రూ.25 వేల విలువైన యూనిఫాం దుస్తులను సమకూర్చారు. నెల రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు ప్రభావతి, జిల్లా నాయకుడు నడిపేన లక్ష్మణరావు తదితరులు క్రీడాకారులను అభినందించారు. ఆల్తి శ్రీనివాసరావు సమకూర్చిన యూనిఫాం దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆల్తి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 50వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

గరివిడి, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.అగ్రహారం రైల్వే స్టేషన్ సమీపంలోని పైడితల్లి అమ్మవారి దేవాలయానికి కొత్త అగ్రహారానికి చెందిన దివంగత మహంతి నారాయణ, అప్పయ్యమ్మ కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని మంగళవారం ఆలయ కమిటీకి వారు అందజేశారు.

అమ్మవారి హుండీ లెక్కింపు

గజపతినగరం, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాలపేటలో గల మహంకాళీ అమ్మవారి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు చేశారు. ఈవో శ్రీరామ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మూడు నెలలకు సంబంధించి అమ్మవారికి రూ.8425 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో తనిఖీదారు జి.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మలుపుల్లో జంగిల్ క్లియరెన్స్

బొండపల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రంలో జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న చెట్ల తొలగింపునకు ఎస్ఐ యు.మహేశ్ మంగళవారం చర్యలు చేపట్టారు. తుప్పలనూ తొలగించే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి



గజపతినగరం: జాతీయ రహదారిపై ర్యాలీ



రాజాం: ఆందోళన చేస్తున్న మహిళలు



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్‌లో మహిళల నిరసన

గజపతినగరం, జూన్10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై సాక్షి మీడియాలో అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేయించిన జగన్, భారతీరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవిడిమాండ్ చేశారు. అమరావతి మహిళలపై జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం గజపతినగరంలో మహిళలు ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ముంజేటి పార్వతి, రుంకాన అరుణ, బలిరెడ్డిమంగమ్మ, గంద్రేటి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

●రాజాం: సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన జర్నలిస్టులను కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు చేస్తుంటే మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం రాజాం పట్టణంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. సాక్షి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అమరావతి మహిళలను కించపరచడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఇందుకూరి సరళ, కొండవీటి దమయంతి, లావేటి పద్మ, నక్కిన సత్య, ఎర్ర లక్ష్మి, జనగం కంఠం, ఉప్పల కాంతమ్మ, గౌరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల: సాక్షి టీవీలో నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు.. అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై నెల్లిమర్లలో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఆ వ్యాఖ్యలను ప్రసారం చేసిన సంస్థలను మూసివేయాలని మహిళలు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో మంగళవారం సాయంత్రం టీడీపీ మహిళా జిల్లా కార్యదర్శి లెంక హైమావతి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత రామతీర్థం జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో చిల్లా పద్మావతి, కింతాడ కళావతి, చీకటి సుహాసిని, చందక గౌరి, పొడుగు కృష్ణవేణి, కాళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి అధ్యాపకుల సమస్యలు



లోకేశ్‌కు సమస్యలను చెబుతున్న గౌరినాయుడు

లక్కవరపుకోట, జూన్10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లోని గెస్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కిత్తన్నపేట గ్రామానికి చెందిన గెస్టు లెక్చరర్ల అసోసియేషన్ చైర్మన్, సాహితీవేత్త కె.గౌరినాయుడు కోరారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను ఆయన కలిశారు. గత ఏడాది ఎస్.కోటలో సిరికి గెస్టు హౌస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని లోకేశ్‌కు వివరించారు. దానిపై స్పందించిన లోకేశ్.. సమస్యలపై అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గౌరినాయుడు తెలిపారు.

నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



కొత్తపేటలో శంకుస్థాపనకు సిద్ధమైన రోడ్డు

విజయనగరం రూరల్/రింగురోడ్డు, జూన్10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను బుధవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేపట్టనున్నారు. నగరంలోని కె.ఎల్.పురంలో రెవెన్యూ కాలనీలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మేయర్ లక్ష్మి, డిప్యూటీ మేయర్లు,కార్పొరేటర్లు కూడా పాల్గొననున్నారు. నగరంలో రూ.10.79 కోట్లతో 44 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులు నెల రోజుల నిర్దిష్ట వ్యవధిలో పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధంచేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, ఎంఈ రాయల్‌బాబు, ఏఈలు అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు ఎంపీడీవో గంటా వెంకటరావు, మండల ఇంజనీర్ శ్రీనివాసరావు ఇప్పటికే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సందడిగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తదితరులు

విజయనగరం రూరర్, జూన్10 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం సినీ నటుడు బాలకృష్ణ జన్మదినాన్ని నందమూరి అభిమాన జిల్లా సంఘం సందడిగా నిర్వహించింది. తొలుత ఆ సంఘం ప్రతినిధులు కాగిత శ్రీనివాస్ యాదవ్, కనకల మన్మథ, బంటుపల్లి రమేశ్, రమణ, కామేశ్, దువ్వు రాము, గుడ్డాల పాపారావు తదితరుల ఆధ్వర్యంలో అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ముచ్చి రామలింగ స్వామి తదితరులు హాజరయ్యారు. నగరంలోని సిటీ బస్టాండ్, అంజనేయస్వామి ఆలయం, జిల్లా కేంద్రాసుపత్రి వద్ద అన్నదానం చేశారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

పాచిపెంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురవలస సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడడంతో గిరిజన మహిళ మృతి చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చినచీపురువలసకు చెందిన కోట సోమమ్మ (64) పొలం పనులు నిమిత్తం కర్రివలస వెళ్లింది. వర్షం కురవడంతో పనులు నిలిపివేయడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయేందుకు తోటి కూలీలతో కలిసి ఆటో ఎక్కింది. చీపురవలస సమీపంలో ఆటో అదుపు తప్పడంతో పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సోమమ్మ ఆటో కింద పడిపోవడంతో తీవ్ర గాయలయ్యాయి. వెంటనే సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సోమమ్మ భర్త కోట పారయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటసురేష్ కేసు నమోదు చేశారు.

స్పోర్ట్స్ అకాడమీకి ఎస్.కోట విద్యార్థి

శృంగవరపుకోట, జూన్10 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటకు చెందిన విద్యార్థి కె.అభిషేక్ రాజు యానాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న అకాడమీకి ఎంపికయ్యాడని స్పార్టన్ బాడ్మింటన్ అకాడమీ కోచ్ మళ్లా ప్రసాద్ తెలిపారు. మంగళవారం సదరు విద్యార్థిని అకాడమీ వ్యవస్థాపకుడు డీవీ సూర్యనారాయణ, విజయరామరాజు, బోనీ ఈశ్వరరావు, రొంగలి మోహన్ అభినందించారు.

రిటైర్డ్ హోంగార్డుకు 'చేయూత'



చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూన్10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బీవీ రమణమూర్తికి తోటి ఉద్యోగులు పోగు చేసిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3.23 లక్షల చెక్కును చేయూత కింద ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులు చేయూత కింద ఒక్కరోజు అలవెన్సును అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ రమేశ్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయండి: ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైం, జూన్10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాల దర్యాప్తు వేగవంతం చేయాలని అడిషనల్ ఎస్పీ సౌమ్యలత పోలీసు అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న సైబర్ నేరాల కేసులపై మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాలను జరిగిన వెంటనే బాధితులు 1930 ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఈ మెయిల్స్ లింకులు, క్యూఆర్ కోడ్‌లను క్లిక్ చేయవద్దని చెప్పాలన్నారు. మోసగాళ్ల ప్రలోభాలకు లొంగవద్దని చెప్పాలన్నారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల్లో వెనుకబాటు తగదు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో

రేగిడి, జూన్10 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర సిటిజన్ సర్వే, స్వచ్ఛ భారత్ నిర్వహణ, ఇతరత్రా ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల్లో వెనకబాటు ఉండకూడదని చీపురపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీవో) హేమసుందరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన యోగాంధ్ర లక్ష్యం, సిటిజన్ యాప్ రిజిస్ట్రేషన్, స్వచ్ఛ సంకల్పం అమలుపై ఎంపీడీవో శ్యామలకుమారి, సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాన్నిచేరుకోవాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ ఉన్నారు.

పాత్రికేయ విలువలు మరవడం సిగ్గుచేటు

●ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర



మాట్లాడుతున్న దొన్నుదొర

శృంగవరపుకోట రూరల్, జూన్10 (ఆంధ్రజ్యోతి): సాక్షి మీడియా జర్నలిస్టులు విలువలు పాటించకుండా అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడటం సిగ్గుచేటు అని ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మంగళవారం మండలంలోని బొడ్డవరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ వ్యాఖ్యల వెనుక ఎవరు ఉన్నారో ప్రజలు గ్రహించారన్నారు. గతంలో అమరావతిపై అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ శ్మశానం అంటూ వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే చానల్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని,మహిళల ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. రానున్న రోజుల్లో అమరావతి అంతర్జాతీయ స్థాయిలో అతి గొప్ప రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్దబోతున్నారని దొన్నుదొర అభిప్రాయపడ్డారు.

తెరచుకోని వ్యవసాయ కార్యాలయం



భోగాపురంలో మండల వ్యవసాయ కార్యాలయమిదే..

భోగాపురం, జూన్10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల సముదాయంలోని వ్యవసాయ కార్యాలయం ఏడాదిన్నరగా తెరచుకోవడంలేదు. భవనం శిథిలరూపు దాల్చడమే ఇందుకు కారణం. సచివాలయాలు, ఆర్‌బీకేలు ఉన్నా.. మండల వ్యవసాయ కార్యాలయానికి గతంలో రైతులు వచ్చేవారు. వ్యవసాయాధికారి సూచనలు, సలహాలు పొందేవారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయాధికారి సూచనలు రైతులకు తప్పనిసరి. అయితే స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో అందుబాటులో లేకపోవడంతో వారికి ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిపై మండల వ్యవసాయ అధికారి వి.హరికృష్ణ వివరణ కోరగా, స్థానిక కార్యాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

గజపతినగరం, జూన్10 (ఆంధ్రజ్యోతి):స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహాన్ని జీఆర్‌పీ పోలీసులు మంగళవారం గుర్తించారు. బొబ్బిలి రైల్వే జీఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గజపతినగరం రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీకొట్టడం వల్ల గానీ పట్టాలు దాటుతున్నప్పుడు గానీ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. మృతుడు తెల్ల రంగు షర్ట్‌నీలం రంగు జీన్ ప్యాంట్.దరించి ఉన్నాడన్నారు. షర్ట్ కాలర్‌పై శ్రీశక్తి సాయి కాటన్ షర్ట్ 44 అని ఆంగ్ల అక్షరాలు ఉన్నాయన్నారు. మృతుడి వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి ఆచూకీ కోసం 830990138, 9491813163 నెంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే విజయనగరం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బాలాజీరావు 9490617089 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి ఏడాది జైలు

విజయనగరం క్రైం, జూన్10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో ముగ్గురు దోషులకు ఏడాది సాధారణ జైలు, రూ.51 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయాధికారి పి.బుజ్జి మంగళవారం తీర్పు వెల్లడించారని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. విజయనగరం చెందిన ప్రవీణ గోగులకు తమిళనాడు రాష్ట్రం పెరంబూదురుకు చెందిన పసుపులెట్టి జాషువాతో 2017లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం, మూడు తులాల బంగారు వస్తువులను కన్నవారు కానుకగా ఇచ్చారు. వివాహం అనంతరం భర్త జాషువా, అతని తల్లిదండ్రులు భాస్కరరావు, సుజాత.. అదనంగా మరో రూ.5 లక్షలు కట్నం తీసుకురావాలని ప్రవీణను నిత్యం శారీరకంగా, మానసికంగా భర్త, అత్తామామలు వేధించేవారు. దాంతో ఆమె విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌లో 2018 ఆగస్టు 6న ప్రవీణ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎ.వెంకటరావు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగం దాఖలు చేశారు. కోర్టు విచారణలో ప్రవీణ భర్త పసుపులెట్టి జాషువా, మామ భాస్కరరావు, అత్త సుజాత వరకట్న వేధింపులకు పాల్పడినట్టు రుజువు కావడంతో ముగ్గురికి శిక్షను ఖరారు చేస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారని డీఎస్పీ గోవిందరావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

● రూ.3 వేల నగదు, ఆటో, రెండు మోటార్ సైకిళ్ల స్వాధీనం

కొత్తవలస, జూన్10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కంటకాపల్లి శారదా కర్మాగారం వెనుక మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొత్తవలస పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సీఐ షన్ముఖరావు, ఎస్ఐ హేమంత్‌కుమార్, సిబ్బంది దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేశారు. మరికొందరు అక్కడ నుంచి పరారయ్యారు. రూ.3 వేల నగదుతో పాటు ఓ ఆటో, రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురూ విశాఖకు చెందిన వారని పోలీసులు తెలిపారు. అలమండ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గుర్తించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

● ఒకరి పరిస్థితి విషమం



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

మెంటాడ, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిరసాడవలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆంద్ర ఎస్ఐ సీతారాం అందించిన వివరాలు ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ గూడెం గ్రామానికి చెందిన గెమ్మెల రాంబాబు, గెమ్మెల అప్పలస్వామి సాలూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా బిరసాడ వలస వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయారు. సమీపంలోని కోళ్ల ఫారం సిబ్బంది 108, 100కి కాల్ చేశారు. ఘటనా స్థలానికి ఆంద్ర ఎస్ఐ అక్కడకు వెంటనే చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికులతో కలిసి ఎస్ఐ.. ఆటో ఎక్కించి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. 108 వాహనంలో మరో క్షతగాత్రుడిని కూడా విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

యోగాతోనే ఆరోగ్యం



సంతకవిటిలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో

సంతకవిటి, జూన్10 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం సంతకవిటి, మామిడిపల్లిల్లో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు మాట్లాడారు. మన జీవితంలో యోగా భాగమైనప్పుడే ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను మాట్లాడుతూ యోగాలో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.




రేగిడిలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

●రేగిడి: యోగా ప్రతిఒక్కరి దినచర్యలో భాగం కావాలని ఎంపీడీవో శ్యామలకుమారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిదులు యోగాసనాల వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ఈశ్వరరావు, ఎంఈవో వరప్రసాదరావు, ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద వైద్యులు సునీల్‌కుమార్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంతో మేలు

నెల్లిమర్ల, జూన్10 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమైనదని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాథ ఆధ్వర్యంలో కిశోర వికాసం ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వైస్ చైర్మన్ రామారావు, ఐసీడీఎస్ పీవో ప్రసన్న హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి నారాయణమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శులు శాంభవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

శృంగవరపుకోట, జూన్10 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీని చాటుకున్నారు. ప్రయాణికుల అభినందనలు అందుకున్నారు. మంగళవారం ఎస్.కోట-విశాఖ బస్సులో నరేశ్ అనే ప్రయాణికుడు ల్యాప్‌టాప్ మరిచిపోయి దిగిపోయాడు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌ను కండక్టర్ సతీశ్ చూసి, దాన్ని భద్రపరిచారు. అనంతరం ఎస్.కోట డిపో మేనేజర్ రమేశ్‌కు దాన్ని అప్పగించారు. అనంతరం మేనేజర్ సమక్షంలో సంబంధిత ప్రయాణికుడికి అప్పగించారు. దాంతో సదరు వ్యక్తి ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపాడు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం: ఎమ్మెల్యే



కురుపాం:యోగా ర్యాలీ నిర్వహిస్తున్న తోయక జగదీశ్వరి,ఉద్యోగులు

కురుపాం, జూన్10 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండొచ్చని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మంగళవారం కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసనాలు వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్వశిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, తహసీల్దార్ రమణమ్మ, డాక్టర్ ప్రజ్ఞ, ఏపీఎం బి.వెంకటరావు,ఏపీఓ పి.బావాజీ పాల్గొన్నారు.

పార్వతీపురంలో జిల్లా స్థాయి యోగా పోటీలు

పార్వతీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కలెక్టరేట్‌లో యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు మంగళవారం పర్యవేక్షించారు.జిల్లాలో వివిధ మండలాల, పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహిస్తున్నామని, శనివారం వరకు ఈ పోటీలు కొనసాగుతాయని తెలిపారు.

సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలి

కురుపాం, జూన్10(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో వారికి అవసరమైన విత్తనాలు పింపిణీ చేయాలని వ్యవసాయ అధికారులకు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. మంగళవారం కురుపాం రైతు సేవా కేంద్రం వద్ద ఖరీఫ్‌కు సంబంధించిన ప్రభుత్వ రాయితీ రైతులకు వరి, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, వ్యవసాయ అధికారులు పి.నాగేశ్వరరావు,పి.శంకరరావు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కోరారు. పార్వతీపురంలో మంత్రి నారా లోకేష్‌ను జగదీశ్వరి కలిసి కురుపాం నియోజకవర్గ సమస్యలను వివరించారు. పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, దశాబ్దకాలంగా ఉన్న ఏనుగులను త్వరితగతిన తరలించాలని, కురుపాంలో నిర్మాణంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాల పూర్తి చేయాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో పి.ఆమిటి పంచాయతీలో స్కూల్స్ మంజూరు చేయాలని విన్నవించారు.

దోమల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న విజయపార్వతి

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో కిల్లి విజయ పార్వతి తెలిపారు. మంగళ వారం స్థానిక ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన వసతిగృహంలో దోమల నివారణకు ద్రావణంతో పిచికారీ చేశారు.కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కొక్కిరపాటి తేజ్ రతన్‌రాజ్, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, హెచ్‌వీ రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమారామలింగేశ్వరాలయంలో ఈవో కె.సర్వేశ్వరరావు, అర్చకులు ఎస్.సంగమేశ్వరరావు, పత్రిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం మంగళవారం నిర్వ హించారు. మాజీ కౌన్సిలర్ గుమ్మడి సింహాద్రి, దమయంతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.కార్యక్రమంలో శాసపు సర్వారావు, గుమ్మడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో గీతా సత్సంగం

పట్టణంలోని కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు అంజిబాబు ఆధ్వర్యంలో గీతాసత్సంగం మంగళవారం నిర్వహించారు. పార్వతీపురానికి చెందిన కంచుమోజు రామోహన్‌రావు, పాలకొండకు చెందిన ఎన్‌వీ రమణ, జడ్డు జగ్గారావు, అరికట్ల కామేశ్వరరావు, డి.యోగేశ్వరరావు తదితర ఆధ్యాత్మిక వేత్తలు భగవద్గీతను వివరించారు.

కురుపాంలో రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం

కురుపాం,జూన్10(ఆంధ్రజ్యోతి):స్థానిక షిర్డీసాయి ఆలయ ప్రాంగణం లోగల రేణుకాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజ చేపట్టారు. అనంతరం పంచకుండముల గాయత్రీ హోమం అర్చకులు నెల్లి సింహాచలం ఆధ్వర్యంలో గాయత్రి ప్రజ్ఞా పీఠం సహకారం తో చేపట్టారు.

పాఠశాల రీఓపెనింగ్‌ను ఘనంగా నిర్వహించాలి

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగరపంచాయతీ పరిధిలో ఇందిరానగర్ కాలనీలో గురువారంస్కూల్ రీఓపెనింగ్ ఘనంగా నిర్వహించాలని టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు కోరారు. విద్యార్థులకు స్వాగతంపలుకుతూ మిఠాయిలు పంచిపెట్టాలన్నారు. ఈ మేరకు మంగళవారం రూ.10 వేలు విరాళాన్ని ఉపాధ్యాయులకు అందించారు.

గిరిజనుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులు హక్కులు కాలరాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆరోపించారు.మంగళవారం మండలంలోని వనకాబడిలో సీపీఎంనాయకులు, మాజీసర్పంచ్ కిల్లక శంకరరావు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.శ్రీను, పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

మక్కువ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):పెండింగ్ సర్వే వేగవంతం చేయాలని మక్కువ పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు కోరారు.మంగళవారం స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుల ఈకేవైసీ తక్షణమే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. యోగాంధ్రపై నిర్వహించే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సతీష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. మంగళవారం మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రమణారావు, ఇంజనీరింగ్ విభాగం పాలకొండ నగర పంచాయతీ కన్వీనర్ వై.హరిబాబు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు యజ్జల సురేష్, సురేష్, పడాల సాయి, బాబూరావు, వెంకట్, కాద రాము పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రోడ్డుపై చెత్త.. రాకపోకలకు అగచాట్లు



కార్యాయాలకు వెళ్లే రహదారిలో పేరుకుపోయిన చెత్త

- గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ
- ఇదీ బలిజిపేటలో పరిస్థితి

బలిజిపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బలిజిపేటలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతోంది. వర్షాకాలం కావడంతో పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు చోద్యంచూస్తున్నారు. కార్యాలయాలపరిసరాల్లో రోడ్డుపక్కన రోజుల తరబడి చెత్తనిల్వ ఉండడంతోపాటు రాకపోకలకు అవస్థలు తప్పడంలేదని సిబ్బంది వాపోతున్నారు.

బలిజిపేటలోని ఎంపీడీవో, పోలీసు, తహసీల్దార్, ప్రభుత్వాసుపత్రి, ఉపాధిహామీ పథకం, వ్యవసాయశాఖ, వెలుగు తదితర కార్యాలయాలు ఒకేచోట ఉన్నాయి. ఈ కార్యాలయాలకు బస్టాండ్ నుంచి వెళ్లే రహదారి నిత్యం దుర్గంధ భరితంగా ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.మెట్టవీధి నుంచి రోడ్డుకు ఇరువైపులా స్థానికులు బహిర్భూమికి వినియోగిస్తుండడంతో దుర్గందభరితంగా మారుతోందని పలువురు వాపోతున్నారు. అధికారులు, సిబ్బంది ఇదే రహదారి మీదుగా అనునిత్యం విధులకు హాజరవుతున్నా ఇక్కడి మురుగు నీటి నిల్వ సమస్య పరిష్కరించడంలేదని,దీంతో రహదారిలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు. ఇక్కడున్న వ్యవసాయశాఖ, ఉపాధిహామీ, వెలుగు కార్యాలయాల పరిసరాల్లో చెత్త తొలగించకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కుళ్లి దుర్వాసన వెలువడుతోంది. గతంలో బలిజిపేట కలెక్టర్ పర్యటించిన సమయంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. తక్షణమే కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

జగన్ క్షమాపణ చెప్పాలి

- వైసీపీ నాయకుల తీరుమారలేదు: మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు, జూన్10(ఆంధ్రజ్యోతి):అమరావతి మహిళలపై చేసిన వ్యాఖ్యలకు జగన్, సజ్జల, సాక్షి యాజమాన్యం బేషరతుగా క్షమాపణచెప్పాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. వైసీపీ, సాక్షి చానల్‌ను మూసేసే సమయం దగ్గరపడిందని తెలిపారు.ఈ మేరకు గురువారం ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ మహిళల విషయంలో జగన్‌రెడ్డి, సజ్జల,కొమ్మినేని తీరుఅసహ్యంగాఉందన్నారు. మహిళలను ఉద్దేశించి సాక్షి డిబేట్‌లో జర్నలిస్టు, మరో విశ్లేషకుడు వ్యవహరించిన తీరు చాలా దుర్మార్గంగా ఉందని తెలిపారు. కొమ్మినేని అరెస్టు విషయంలో ప్రభుత్వం పొరపాటు చేసిందని జగన్‌రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి ఆడపడుచుల్లో ఒక్కరు కూడా వైసీపీకి ఓటు వేయలేదని భావిస్తున్నారా అని ప్రశ్నించారు. అమరావతి ఆడబిడ్డలపై జుగుప్సాకర వ్యాఖ్యలు వైసీపీ పతనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి చీకట్లోకి తొక్కినా ఆ పార్టీ నేతల తీరు మారలేదని తెలిపారు. వైసీపీ నాయకులకు మహిళలంటే మొదటి నుంచి చిన్నచూపని పేర్కొన్నారు.

కురుపాంలో మహిళల ర్యాలీ



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కురుపాం,జూన్10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను అవమానపరిచేలా ప్రచారం చేసిన సాక్షి మీడియా అధినేత భారతిరెడ్డి బహిరంగా క్షమాపణ చెప్పాలని మహిళలు కోరారు. మంగళవారం కురుపాంలో అమరావతిని వేశ్యల రాజధానిగా సాక్షి చానల్‌లో అభివర్ణించిన జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలను నిరసిస్తూ గిరిజన మహిళలు ర్యాలీ నిర్వహించారు. సాక్షి చానల్, పేపర్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిడ్డిక కళావతి,అప్పల కొండ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు సన్న బియ్యం

గుమ్మలక్ష్మీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 102 ఆశ్రమపాఠశాలు, గురుకుల పాఠశాలలో పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు మంగళవారం నుంచి సన్నబియ్యం పంపిణీకి సంబంధిత ఉన్నతాధికారి నుంచి ఆదేశాలొచ్చాయి. ఇక ముందు సన్న బియ్యం విద్యార్థులకు ఆహారంగా పెట్టనున్నారు. ఈనెల నుంచే అన్ని ఆశ్రమ పాఠశాలల వసతిగృహాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యువో సురేష్‌కుమార్ తెలిపారు.

సకాలంలో సరుకులు అందించండి

- పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ రామారావు



సరుకులు పరిశీలిస్తున్న డీఎం రామారావు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సకాలంలో డీఆర్ డిపోల ద్వారా వినియోగదారులకు సరుకులు అందించే ఏర్పాటు చేయాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ రామారావు కోరారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం గిరిజనసహకార సంస్థ సరుకుల స్టాక్ గోదాములో నిల్వలు, రికార్డులను కూడా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల్లో సరుకులు వర్షం వల్ల చెడిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పార్వతీపురం జీసీసీ మేనేజర్ సాంబశివరావు ఉన్నారు.

గ్రామాల్లో వారాల పండుగ సందడి



సాంబన్నవలసలో దేశమ్మతల్లి వారాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

గరుగుబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబన్నవలస తదితర గ్రామాల్లో మంగళవారం వారాలు పండగను ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. వరి ఉబాలు, ఎదలు చేసుకునే ముందుగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు ఇక్కడ చేయడం ఆనవాయితీ. దీంతో గ్రామాల్లో వారాల పండుగ సందడి నెలకొంది.

అర్హులైన రైతులకు విత్తనాలు ఇవ్వండి

సాలూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జనవరివలస ఏపీ సీడ్స్ ద్వారా అర్హులైన రైతులకు సక్రమంగా విత్తనాలు అందించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు జలుమూరి మణికుమార్ కోరారు. మంగళవారం కరాసవలస ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీసీడ్స్ వద్ద కొందరు దళారుల ప్రమేయం అధికంగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. విత్తనాల పంపిణీలో దళారుల జోక్యం లేకుండా జరగాలని కోరారు. కొద్దిరోజుల కిందట విత్తన ధాన్యంసేకరణలో సైతం ఆరోపణలొచ్చాయన్నారు. పారదర్శకంగా విత్తనాలు పంపిణీ చేసి ఆరోపణలు రాకుండా అప్రమత్తం కావాలని కోరారు.

డిప్యూటీ ఈవోగా రామ్మోహనరావు

సీతంపేట రూరల్,జూన్ 10(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ ఈవోగా గున్నరామ్మోహనరావు నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ డిప్యూటీ ఈవోగా విధులు నిర్వహించిన ఆర్‌వీ కుమార్ కేఆర్‌పురం బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో కేఆర్‌పురం నుంచి సీతంపేటఐటీడీఏ డిప్యూటీ ఈవోగా రానున్న రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉపాధి జేఈగా తేజేశ్వరరావు

గరుగుబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ మండల జేఈగా దాసరి తేజేశ్వరరావును నియమితులయ్యారు. జియ్యమ్మవలస మండలంలో జేఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను గరుగుబిల్లికి బదిలీచేస్తు డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. గరుగుబిల్లిలో ఇన్‌చార్జి జేఈగా విధులు నిర్వహిస్తున్న గంట అన్వేష్‌ను జియ్యమ్మవలసకు బదిలీ చేశారు. గరుగుబిల్లిలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన సీహెచ్ రుద్రకోటేశ్వరరావును జిల్లా కార్యాలయానికి, ఆయన స్థానంలో కొమరాడలో టీఏగా విధులు నిర్వహిస్తున్న జి.జగదీశ్వరరావును నియమించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో జి.పైడితల్లికి బదిలీ ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆరోపణలకు తావులేకుండా వ్యవహరించాలన్నారు.

ఒకరికి గాయాలు

కురుపాం రూరల్: 10 జూన్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంత్రజోల గ్రామానికి చెందినపత్తిక సురేష్ కర్రల కోత మిషన్ చేయి జారడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు..మంత్రజోల గ్రామానికి చెందిన పత్తిక సురేష్ కర్రల కోత మిషన్ పట్టుకుని మర్రిగూడ వద్ద తన పొలంలో మంగళవారం పనిచేస్తున్నాడు. ఆ సమయంలో చేయి జారి కోత మిషన్ సురేష్‌ను కోసేసింది. సురేష్‌కు కడుపు, తోడ బాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్థులు హుటాహుటిన కురుపాం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సురేష్‌ను పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు.ఈ మేరకు కురుపాం పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

పాలకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను వైసీపీ నాయకుల చెరనుంచి కాపాడాలని సామాజిక కార్యకర్త సబ్బా నాని కోరారు. ఈ మేరకు పార్వతీపురంలో మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకొండ గొడగల వీధిలో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేయడంపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నార న్నారు.ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరారు.

దారి కష్టాలు తప్పవా?

(5వ పేజీ తరువాయి)

ఓ కాంట్రాక్టర్ ఆ శాఖ కార్యాలయంలోని కంప్యూటర్‌లో నిక్షిప్తమైన ఎస్టిమేట్‌లను సొంతంగా ప్రింట్‌లు తీసుకోవడం కనిపించింది. ఎంబుక్‌లను కాంట్రాక్టర్లే నేరుగా కార్యాలయ బీరువా నుంచి వెతికి తీసుకుపోవడం ఇక్కడసర్వసాధారణంగా మారింది. ఇదేమిటని అడిగేవారు లేకపోవడంతో ఇంజనీరింగ్ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తు న్నారనే విమర్శలూ లేకపోలేదు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెళ్లాలంటే కాంట్రాక్టరే ఓ ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. పని జరిగే ప్రదేశానికి తీసుకువెళ్లి, తీసుకురావాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. అలా కాంట్రాక్టర్లు చేయకుంటే ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులను పరిశీలించరని, బిల్లు రికార్డింగ్ చేయరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఇక పాతపట్నం డివిజన్ పరిధిలోని ఓ ఇంజనీరింగ్ ఏఈ ఏకంగా కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై కూడా సంబంధిత ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఇలా ఈ శాఖపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖ అధికారుల్లో ఎటువంటి మార్పు రాకపోవడం శోచనీయం.

పనులు నత్తనడకనే..

ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న వివిధ రకాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఉపాధి పథకం ద్వారా నిరిస్తున్న రహదారి పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లింపులు జరగలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇతర గ్రాంట్ నిధులతో నిర్మిసున్న పనులకు సంబంధించి బిల్లులు రికార్డింగ్ చేయడంలో ఇంజనీరింగ్ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులను నిలిపివేస్తున్నారు.



ఆరోపణలుఎదుర్కొంటున్న రహదారిని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

- గత టీడీపీ ప్రభుత్వ హయం(2018)లో చేపట్టిన ఆశ్రమ పాఠశాలల మరమ్మతు పనులకు సంబంధించిన(మెంటినెన్స్ గ్రాంట్)బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. కొన్ని బిల్లులను ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులు తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు చెల్లించారు. ఇంకా 50కి పైగా వర్క్‌ల బిల్లులను చెల్లించాల్సి ఉంది.

రియల్.. ఢమాల్

(5వ పేజీ తరువాయి)

ప్రధాన రహదారి, పార్వతీపురం-బొబ్బిలి రహదారితో పాటు సాలూరు తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో పొలాలు, భూములు కొనుగోలు చేశారు. రహదారికిరువైపులా విస్తరించి ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి లక్షల రూపాయలు వెచ్చించి వెంచర్లను సిద్ధం చేశారు.

వైసీపీ అడ్డగోలు తీరుతో...

- వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు వ్యవహారంతో రియల్ వ్యాపారం మందగించింది. 2021లో ఎల్‌ఆర్‌ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ప్రవేశపెట్టింది. సదరు వెంచర్లలో కొంత స్థలాన్ని ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు చేపట్టింది. 20 ఏళ్ల కిందట వెంచర్లు వేసిన వారు సైతం ఎల్‌ఆర్‌ఎస్ స్కీంతోనే భవన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రియల్టర్లకు చెందిన ప్లాట్లు అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయాయి. కాగా అంతకు ఆరు నెలల ముందే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి సర్వర్‌ను నిలుపుదల చేశారు.
- 2023లో వీఎల్‌టీ (వేకండ్ ల్యాండ్ టాక్స్‌ను)ని భూమి, స్థలయజమానులపై వైసీపీ ప్రభుత్వం రుద్దింది. నూతన లేఅవుట్ వేయాలంటే సవాలక్ష నిబంధనలను పెట్టింది. దీంతో వ్యాపారులు లేఅవుట్‌లు వేయలేక వీఎల్‌టీ, ఎల్‌ఆర్‌ఎస్‌తో ముందుకెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో భూములు, స్థలాల క్రయ, విక్రయాలు పూర్తిగా పడిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత చర్యలు, అప్పటి అధికార యంత్రాంగం అత్యుత్సాహం కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం తలకిందులైంది. కోట్లాది రూపాయలతో పెట్టుబడులు పెట్టి వందల ఎకరాలు కొనుగోలు చేసిన రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు. వారిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వందలాది మంది ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భూమి, స్థలం అమ్ముకుందామని కొందరు ముందుకొస్తున్నప్పటికీ కొనుగోలు చేసే వారే కరువయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రధాన రహదారి పక్కన ఎకరా భూమిని సుమారు రూ.5 కోట్లుకు కొనుగోలు చేస్తే ప్రస్తుతం దానిని రూ.మూడు కోట్లకు కూడా కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.
- సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం, ఈ-స్టాంపుల విధానంతో ప్రజలను తికమక పెట్టడం వంటి వాటితో కొనుగోలుదారులు, అమ్మకందారులు విసుగుచెందారు.
- జిల్లాలో గతంలో వివిధ రకాలైన భవనాలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్లు 80 నుంచి 100 వరకు జరిగేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 50 నుంచి 40కి పడిపోయింది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఆదాయం గణనీయంగా తగ్గింది.
- దీనిపై ఓ అధికారిని (పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) వివరణ కోరగా.. గతంలో పోల్చుకుంటే జిల్లాలో రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గింది. ప్రస్తుతం భవనాలు, ఇతరత్రా చిన్నపాటి రిజిస్ట్రేషన్లే అవుతున్నాయి. స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్లు పూర్తిగా జరగడం లేదని తెలిపారు.

ఎస్జీటీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

(5వ పేజీ తరువాయి)

ఆయన ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు మంగళవారం జడ్పీ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బదిలీలకు 2,200 మంది ఎస్జీటీలు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1748 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. కాగా మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఒకటి నుంచి 400 నెంబర్ల వరకు ఎస్జీటీలు మధ్యాహ్నం రెండు గంటలకు విజయనగరం జడ్పీ కార్యాలయం వద్దకు హాజరయ్యారు. సాంకేతిక లోపాల వల్ల తొలుత 201 నుంచి 400 నెంబర్ల వరకు ఉపాధ్యా యులకు కౌన్సెలింగ్ వాయిదా వేశారు. మిగిలిన 1 నుంచి 200 నెంబర్ల వరకు ఉన్న ఉపాధ్యాయులు రాత్రి 8 గంటల వరకు వేచి ఉన్నారు. చివరకు సాంకేతిక సమస్యల వల్ల వారికి సైతం కౌన్సెలింగ్ వాయిదా వేసినట్టు ప్రకటించారు. దీంతో వారంతా తరలిపోయారు. ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ఈ నెల 11న ప్రారంభం కానుంది. ఒకటి నుంచి 400 నెంబర్ల వరకు ఉదయం 8.30 గంటలకు, 401 నుంచి 800 నెంబర్ల వరకు మధ్యాహ్నం 1.30 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

గరుగుబిల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కొమరాడ ఐసీడీఎస్ సీడీపీవో జి.సుగుణ కుమారి సూచించారు.మంగళవారం మండలంలోని రావుపల్లిలో కిషోరివికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, పి.అరుణకుమారి పాల్గొన్నారు.